క్లుప్తంగా

మోహన్ రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్: ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప నాయకుడు అయిలేని మోహన్ రెడ్డి అని పలు రాజకీయ పార్టీల నాయకులు కొనియాడారు. 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడారు. ప్రజల హృదయాల్లో నిలిచిన మోహన్ రెడ్డి నక్సలైట్ల చేతిలో హత్యకు గురయ్యాడన్నారు. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాడన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, మోహన్ రెడ్డి కుమారుడు మల్లికార్జున్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులపై నిరసన



శిలాఫలాకానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రం నుంచి చిలాపూర్ మీదుగా రేగులపల్లె వరకు రూ.3.97 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉన్నందుకు బుధవారం బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. నిర్మాణ శిలాఫలకానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన అసంపూర్తి పనుల కారణంగా లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలకు వచ్చిన భక్తులు ఇబ్బందిపడ్డారన్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, దాచారం ఎంపీటీసీ రాజు, సంగ రవి, బుర్ర మల్లేశం, దొమ్మాటి రాములు, సత్యనారాయణ, రమేష్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

రైతులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గంలో రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా పట్టించుకోని ఎమ్మెల్యే హరీశ్‌రావు పక్క జిల్లా రైతులపై మొసలి కన్నీరు కార్చటం సిగ్గుచేటని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు మండిపడ్డారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని హరీశ్‌రావు అధికారం పోగానే రైతు సమస్యలంటూ మొసలి కన్నీరు కారుస్తున్నాడన్నారు. నియోజకవర్గంలో రిజర్వాయర్ ఉన్నప్పటికీ ఒక్క చెరువు, కుంట నిండలేదన్నారు. పదేళ్లు మంత్రిగా పని చేసి, స్వంత నియోజకవర్గ రైతు సమస్యలు పట్టించుకోలేదని ఆరోపించారు.

ఆహ్వానించి అవమానించారు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రెస్‌మీట్‌కు ఆహ్వానించి తాను కూర్చునేందుకు కుర్చీ ఇవ్వకుండా అవమానించారని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో మంత్రి ప్రెస్‌మీట్‌కు ఆహ్వానం అందిందని, ప్రెస్‌మీట్‌లో కూర్చునేందుకు కుర్చి ఇవ్వకుండా అగౌరవపర్చారన్నారు. బీఆర్ఎస్ పాలనపై ఉద్యమాలు, పోరాటాలు చేశానని, నాడు కనిపించని నాయకులు ఇప్పుడు మంత్రి పక్కన కుర్చున్నారన్నారు. పార్టీని వీడకుండా, పార్టీ అభివృద్ధికి కోసం కృషి చేశానన్నారు. మంత్రి సమక్షంలో అవమానించిడం సరికాదన్నారు.

ముత్యాల తలంబ్రాలు సమర్పణ

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన వెంట ఎంపీపీ కరుణాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, నాయకుడు చందు తదితరులున్నారు.

ఫంక్షన్ హాల్‌కు తాళం

చేర్యాల(సిద్దిపేట): ఆస్తి పన్ను బకాయి ఉన్న పట్టణంలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌కి బుధవారం మున్సిపల్ అధికారులు తాళం వేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ నర్సయ్య మాట్లాడుతూ పట్టణ పరిధిలోని బకాయిదారులు ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించినందున తమ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అత్యధిక పన్ను బకాయి ఉన్నవారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

బస్సును పునరుద్ధరించండి

మిరుదొడ్డి(దుబ్బాక): మండలంతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి ప్రయాణికులకు అనువుగా ఉండే మల్లుపల్లి-రుద్రారం నైట్‌హాల్ట్ ఆర్టీసీ బస్సును పునఃరుద్ధరించాలని కోరుతూ సిద్దిపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరికి వినతి పత్రం ఇచ్చినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేష్ బుధవారం తెలిపారు.

బడి బాధ్యత అమ్మదే!

- ప్రభుత్వ బడుల పర్యవేక్షణకు మహిళా సంఘాలు
- 53 పాఠశాలల్లో ఆదర్శ కమిటీల ఏర్పాటు
- కమిటీ పేరిట బ్యాంకులో ఖాతా
- అభివృద్ధికి నిధులు మంజూరు

ఇకపై ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత సదరు పాఠశాలలో చదువుతున్న చిన్నారుల తల్లులే చేపట్టనున్నారు. ఈ మేరకు మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మౌలిక వసతుల కల్పన, పాఠశాలల బలోపేతానికి అవసరమైన పనులు చేపట్టే బాధ్యత ఈ సంఘాలకు అప్పగించనున్నారు. గతంలో ఈ పనులు ఎస్ఎంసీ సభ్యులు చేపట్టేవారు. ఇప్పుడు వారి స్థానంలో మహిళా సంఘాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు కూడా పూర్తి చేశారు.



రామునిపట్ల ఉన్నత పాఠశాల

చిన్నకోడూరు(సిద్దిపేట): గతంలో ఎస్ఎంసీ చైర్మన్, సభ్యుల నియామకం ఉండేది. ఇప్పుడు వారి స్థానంలో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు(వీఓ) అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌గా, పాఠశాల హెచ్ఎం కన్వీనర్‌గా ఉండనున్నారు. 1 నుంచి పది తరగతులు చదివే విద్యార్థుల తల్లుల్లో ప్రతీ తరగతి నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారు. వీరు కూడా ఎస్‌హెచ్‌జీలో సభ్యులై ఉండాలి. ఆ ముగ్గురిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ ఉండాలి. ఈ కమిటీల నియామకం పూర్తయిన తరువాత అమ్మ ఆదర్శ కమిటీ పేరుతో బ్యాంకులో ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేస్తారు. గతంలో ఎస్ఎంసీ ఖాతా ఉన్నా ఇప్పుడు కొత్తగా ఖాతా ఏర్పాటు చేయాలి. ఈ మేరకు అన్ని పాఠశాలల హెచ్ఎంలు కొత్త ఖాతాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

మండలంలో 53 పాఠశాలలకు

చిన్నకోడూరు మండలంలో మొత్తం 53 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలకు నిధులు మంజూరయ్యాయి. రూ. 25 వేల లోపు పనులు ఎలాంటి టెండర్లు లేకుండా సదరు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులే చేయించొచ్చు. రూ.లక్ష దాటితే కలెక్టర్ పర్యవేక్షణలో పనులు నిర్వహించాల్సి ఉంటుంది. ఏప్రిల్ నుంచి కమిటీలు బాధ్యతలు చేపట్టనున్నాయి. పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తామంటున్నారు.

కమిటీలు ఏర్పాటు పూర్తయ్యాయి

మండలంలో 53 పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.25 వేల నుంచి రూ. 2.50 లక్షల వరకు విడుదలయ్యాయి. కమిటీల ప్రక్రియ పూర్తి చేశాం. మే నుంచి పనులు ప్రారంభిస్తారు.

– దేశిరెడ్డి, ఎంఈఓ

పాఠశాలలను బలోపేతం చేస్తాం



ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. నిత్యం పాఠశాలలను పర్యవేక్షిస్తాం. పాఠశాలలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– సుశీల, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, చిన్నకోడూరు

నేటితో ముగియనున్న అవిశ్వాస తీర్మాన గడువు

కొండపాకకు దక్కేలా నాయకుల ప్రయత్నాలు



కొండపాక మండల సమీకృత కార్యాలయ భవన సముదాయం

కొండపాక(గజ్వేల్): బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పట్టించుకోవడం లేదంటూ కొండపాక ఎంపీపీ ర్యాగల్ల సుగుణపై పెట్టిన అవిశ్వాస తీర్మానం గురువారంతో ముగియనుంది. ఈనెల 5వ తేదీన ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన తీర్మాన ప్రతిని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్‌కు అందజేస్తూ అక్కడి నుంచే క్యాంపులోకి వెళ్లారు. దీంతో 28వ తేదీ అవిశ్వాసానికి అధికారులు గడుపు పెట్టారు. కాగా జరిగిన ఎన్నికల్లో బందారం ఎంపీటీసీ ర్యాగల్ల సుగుణ ఎంపీపీ పదవి దక్కించుకుంది. కుకునూరుపల్లి ఎంపీటీసీ 2 (కాంగ్రెస్) రెడ్డమైన గీత అనారోగ్యంతో మృతి చెందగా మండలంలో 13 మంది ఎంపీటీసీలు కొనసాగుతున్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు కావల్సిన తొమ్మిది మంది ఎంపీటీసీలు క్యాంపులోకి వెళ్లారు. రెండు రోజుల కిందట కుకునూరుపల్లి ఎంపీటీసీ బూరమైన భూములుగౌడ్ గ్రామంలో పెద్దమ్మ పండగ జరుగుతుందంటూ క్యాంపు నుంచి బయటకు వచ్చారు. మళ్లీ క్యాంపులోకి వెళ్లకపోవడంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన వారిలో ఆందోళన మొదలైంది. తొమ్మిది మందిలో ఒకరు తగ్గినా అవిశ్వాసం వీగిపోనుంది. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన మరో ఎంపీటీసీని కలుపుకొని ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గించుకొని కొండపాక ఎంపీటీసీ సభ్యురాలు మంచాల అనుసూయకు ఎంపీపీ దక్కేలా బీఆర్ఎస్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

సిద్దిపేట జిల్లాలోనే బెజ్జంకి అభివృద్ధి

మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో సిద్దిపేట జిల్లాలోకి వచ్చిన తరువాతనే బెజ్జంకి అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లోని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఇంటిలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెజ్జంకి అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వంలోని రూ.5 కోట్ల పనులు కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రద్దు చేసిన నిధులే కాకుండా అసంపూర్తి పనులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గుగ్గిల్ల శివారులో ఏర్పాటు చేసే ఇథనాల్ ఫ్యాక్టరీ పాపం కాంగ్రెస్‌దేనన్నారు. ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసేవరకు ఆందోళన చేస్తామన్నారు. సాగునీటిని విడుదల చేయకపోవడంతో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించండి

ఆర్డీఓ రామ్మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్: ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఆర్డీఓ రామ్మూర్తి రాజకీయ పార్టీలకు సూచించారు. ఐఓసీ కార్యాలయంలో బుధవారం రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున విద్వేష వ్యాఖ్యలు చేయడం నిషేధమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నుంచి కేడం లింగమూర్తి, బీఆర్ఎస్ నుంచి అయిలేని మల్లికార్జున్ రెడ్డి, సీపీఐ నుంచి గడిపె మల్లేశ్, బీజేపీ నుంచి శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఆశీస్సులు ఉండాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



బీరప్ప సన్నిధిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): బీరప్ప దేవుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం దూళ్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో జరుగుతున్న బీరప్ప, కామరాతి కల్యాణానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కల్యాణ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల ఆచారాలను సంరక్షించుకునేందుకు కురుమలు ఉత్సవాలు జరపడం అభినందనీయమన్నారు. బీరప్ప స్వామి పండగకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోండి

గజ్వేల్: ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఓటుహక్కుపై విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కుతో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సీఐ సైదా, ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సతీష్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో కేంద్ర బలగాలు, సీఐఎస్ఎఫ్‌తో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని, ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు ద్వారానే ప్రజాప్రతినిధుల ఎన్నిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, చేర్యాల ఎస్ఐ దామోదర్, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు, మద్దూర్ ఎస్ఐ యూనస్ అహ్మద్ అలీ, కోహెడ ఎస్ఐ తిరుపతి, అక్కన్నపేట ఎస్ఐ వివేక్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివి

సిద్దిపేట: కొండపాక మండలం మర్పడకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి వైద్యారోగ్యశాఖలో సీనియర్ ఎంటమాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

గజ్వేల్: మెదక్ ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి విజయం ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో నిర్వహిస్తున్న ఎన్నికల సన్నాహక సమావేశాలకు భారీ స్పందన లభిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతీ ఓటరును కలిసి మద్దతివ్వాలని కోరుతామన్నారు.

మహోన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి



శేరిపల్లి హెచ్ఎం లిల్లీమార్గరేట్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

వర్గల్(గజ్వేల్): ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు, ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. వర్గల్ మండలం శేరిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓఎస్ లిల్లీమార్గరేట్ ఉద్యోగ విరమణ చేశారు. గౌరారంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. లిల్లీ వర్గల్ మండలంలో 34 ఏళ్లు సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ, మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, మండల ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ సునీత, కాంప్లెక్స్ హెచ్ఎం కనకరాజు, కృష్ణ సౌజన్య, పీఆర్టీయూ నాయకులు సుభాష్ రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దార శ్రీనివాస్, గాయత్రి, రజిని తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

కొండపాక(గజ్వేల్): ఉద్యోగులకు విరమణ సహజమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ హైస్కూల్లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వంగ కిష్టారెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం కిష్టారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంచి సేవలకు సమాజంలో గుర్తింపు

మిరుదొడ్డి(దుబ్బాక): ఉద్యోగ విధి నిర్వహణలో చేసినసేవలే సమాజంలో గుర్తింపునిస్తాయని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.వెంకట్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. వెంకట్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సోమగారి నాగిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకట్రాజం, అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ ఫిర్యాదుపై విచారణ

కొమురవెల్లి(సిద్దిపేట): అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నవారిపై ఇటీవల గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని తపాస్‌పల్లి శివారు సర్వే 93లో కొందరు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఇటీవల ఫిర్యాదుచేశారు. బుధవారం మైనింగ్ అధికారి సైదులు తహసీల్దార్ లక్ష్మీనారాయణతో కలసి మైనింగ్ చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా రాయిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. స్టోన్ కట్టర్, మైనింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వెంట ఎస్ఐ నాగారాజు తదితరులు ఉన్నారు



పేలుడు సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

కరువుకు కాంగ్రెస్సే కారణం

మాజీ ఎంపీ వినోద్ కుమార్



వరి పంటను చూపిస్తున్న రైతు పద్మ

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బి.వినోద్ కుమార్ విమర్శించారు. బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఎండిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాకముందు ఉన్న పరిస్థితులు ఇప్పుడు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు తెచ్చిన నిధులు తప్ప కరీంనగర్ పార్లమెంట్ పరిధికి ఎంపీ సంజయ్ అభివృద్ధి చేయలేదని తీవ్రంగా విమర్శించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు

దుబ్బాక: పార్లమెంట్ ఎన్నికల విధులను పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా నిర్వహించాలని, మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. బుధవారం దుబ్బాక, భూంపల్లి, మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లను ఏసీపీ మధుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో నిర్వహించే విధి విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సమస్యాత్మక, సాధారణ పోలీంగ్ స్టేషన్‌ల గురించి సీఐ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పటిష్ట బందోబస్తుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు, గంగరాజు, పరశురామ్, రవికాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బ్రాహ్మణ పరిషత్ కార్యవర్గ సభ్యుడిగా మనోహరాచార్య

గజ్వేల్: వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన తిరుమల మనోహచారాచార్య తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. బుధవారం పరిషత్ అధ్యక్షుడు వెంకటరమణ శర్మ నియామక పత్రం అందజేశారు.

◆ పేద కుటుంబానికి చేయూత

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన యువతి దొంతరవేని అఖిల ఇటీవల అనారోగ్యంతో మరణించింది. మృతురాలి అమ్మ కూడా మరణించడంతో తండ్రి ఇద్దరి కూతుర్లను పోషిస్తున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో స్నేహితులు రూ.1,06,500 విరాళాలు సేకరించి అఖిల సోదరి పేరిట బుధవారం బ్యాంకులో డిపాజిట్ చేశారు. స్నేహితులను చైతన్యపరిచిన డాక్టర్ శంకర్‌ను గ్రామస్తులు అభినందించారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చాపగాని తండా గ్రామ మాజీ సర్పంచ్ బానోతు లక్ష్మీవీరన్న మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం నాయకులు, సభ్యులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ భక్తితో సమాజంలో ప్రశాంతం

రాయపోలు(దుబ్బాక): ప్రజల్లో భక్తి భావం ఉంటేనే సమాజం ప్రశాంతంగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయపోలు మండలం రామారంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు.

◆ వాటర్ ఫిల్టర్ వితరణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారంలో ఇటీవల వాసంపెల్లి యువకుడు మృతి చెందాడు. అతడి జ్ఞాపకార్థం 2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు రూ.40 వేలు విలువ చేసే ఆర్వో వాటర్ ఫిల్టర్లను అందజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎల్లగౌడ్, హెచ్ఎంలు నాగమణి, రవి, మిత్రులు సాయిచరణ్, అశోక్, బాబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ ఎస్సీ మోర్చా నూతన కార్యవర్గం

గజ్వేల్‌రూరల్: బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు నత్తి శివకుమార్ ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా కూరారం బాలనర్సయ్య, మరాటి బాబు, జక్కుల వెంకటేశం, వట్కూలి కనకయ్య, ప్రధాన కార్యదర్శులుగా మన్నె శేఖర్, గజ్వేల్ రాంచంద్రం, కార్యదర్శులుగా మన్నె శ్రీనివాస్, ముక్క అనిల్, సురేందర్, ఏగొండ, కోశాధికారిగా నాగరాజు, అధికార ప్రతినిధులుగా గణేష్, రాజు, కిషన్, సురేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా సాగర్, కార్యవర్గ సభ్యులుగా సామేల్, రమేష్, తుడుమ్ రమేష్‌ను నియమించినట్లు తెలిపారు.

◆ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యా సరస్వతి క్షేత్రంలో నూతనంగా నిర్మితమైన శ్రీచంద్రమౌళీశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండోరోజు బుధవారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి ఆధ్వర్యంలో విశేష పూజాకార్యక్రమాలు జరిగాయి. గురువారం ఉదయం రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి చేతుల మీదుగా యంత్రమూర్తి ప్రతిష్ఠ జరుగుతుందని చంద్రశేఖర సిద్ధాంతి తెలిపారు.

◆ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి భారీ మెజార్టీ

గజ్వేల్‌రూరల్: త్వరలో జరగనున్న మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్‌లోగల శ్రీ పార్థివేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం ప్రారంభించారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు.

◆ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ గల్లంతే

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతే అని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 15, 19 వార్డులకు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి పనులు చేయకపోవడంపై ప్రజలు అసహనంతో ఉన్నారన్నారు.